క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

కంబదూరు: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ సోమవారం కంబదూరు మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయ అవరణంలో జరిగే 3వ విడత వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో మంత్రి పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు మండలంలోని తిమ్మాపురం గ్రామంలో జరిగే 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో కూడా మంత్రి పాల్గొంటారని ఆయన తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, డ్వాక్రా సంఘాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కూడేరు: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి స్థానిక కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్ ప్రవేశానికి సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ ఉమాదేవి ఆదివారం తెలిపారు. ఏప్రిల్ 20 వరకూ అవకాశముంటుందని, డ్రాపౌట్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

'ఎన్‌ఎంఎంఎస్'కు ఎంపిక



ఉపకారవేతనానికి ఎంపికైన విద్యార్థులు

ఉరవకొండ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు నిస్వార్థ సంస్థ ద్వారా శిక్షణ పొందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని సంస్థ వ్యవస్థాపకుడు వెంకట్ ఆదివారం తెలిపారు. సంస్థ ద్వారా 12 మందికి శిక్షణ ఇవ్వగా చిన్నముస్టూరు ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు చెందిన తరుణ్‌కుమార్, ఆఫ్రేద్, రేవంత్, పట్టణంలోని ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన శివకిరణ్, జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలకు చెందిన సాయి చైత్ర ఎంపికయ్యారన్నారు



అర్చన

బెళుగుప్ప: మండలంలోని గుండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థిని కె.అర్చన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మల్లికార్జున ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ ఇచ్చిన గణిత ఉపాధ్యాయుడు వెంకటేశులు, విద్యార్థినిని హెచ్‌ఎం అభినందించారు.

జాగ్రత్తలు తీసుకోండి

ఉరవకొండ: కంటి ఆపరేషన్ అనంతరం జాగ్రత్తలు తీసుకోవాలని వక్తలు సూచించారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, దివంగత వశికేరి గోపినాథ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 8న ఉరవకొండలో నంద్యాల శాంతిరాం ఆస్పత్రి వైద్యులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో కంటి శస్త్రచికిత్సలకు 150 మంది ఎంపికయ్యారు. వీరు నంద్యాలలో వారం రోజుల క్రితం శస్త్ర చికిత్సలు పూర్తి చేసుకుని ఉరవకొండకు వచ్చారు. వారికి పట్టణంలోని వాణి స్కూల్ ఆవరణలో కంటి పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు చేశారు. ట్రస్టు ఉపాధ్యక్షుడు వశికేరి మల్లికార్జున ఆధ్వర్యంలో ఆపరేషన్లు చేయించుకున్న వారికి భోజన వసతి కల్పించారు.

విద్యార్థుల శ్రమదానం

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం గ్రామంలో కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానం చేశారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తను తొలగించారు. అధికారిక విద్య, ఉపాధిలేని యువతపై ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఇంటింటా సర్వే నిర్వహించారు. గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను గుర్తించి చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రం చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డి.నారాయణ, గోవర్ధన, వ్యాయామ అధ్యాపకుడు ప్రశాంత్, సర్పంచ్ నాగరాజు, గ్రామస్తులు రవి, ఎర్రిస్వామి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జామియా మసీదులో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

రాయదుర్గంటౌన్: తహసీల్దార్ రోడ్డు వద్ద ఉన్న జామియా చౌక్ మర్కజ్ మసీదులో ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ విందు జరిగింది. కాలనీకి చెందిన కొంతమంది యువ మిత్ర బృందం ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. దాదాపు వెయ్యి మందికి దాకా ముస్లింలు పాల్గొన్నారు. మసీదు ఇమామ్ ఏజాజ్ ముస్తఫా, ప్రభుత్వ ఖాజీ సైఫుల్లా మాట్లాడుతూ రంజాన్ మాసంలో దీక్షాపరులకు ఇఫ్తార్ ఇవ్వడం ఎంతో పుణ్యఫలమన్నారు.

అతివల అభ్యున్నతే సీఎం లక్ష్యం



'వైఎస్సార్ ఆసరా' మెగా చెక్కు అందజేస్తున్న విప్ కాపు



సమావేశానికి హాజరైన మహిళలు

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి
- 'వైఎస్సార్ ఆసరా' చెక్కుల పంపిణీ

డి హీరేహాళ్(రాయదుర్గం): అతివల అభ్యున్నతే సీఎం 'జగన్' లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం డి హీరేహాళ్ ఉన్నత పాఠశాల మైదానంలో వైఎస్సార్ 'ఆసరా' వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది మహిళామణులు స్వచ్ఛందంగా తరలివచ్చి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. జై జగన్ అంటు నినాదాలు హోరెత్తించారు. అనంతరం సర్పంచ్ హెచ్ లక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ ఎం.పవిత్ర, జెడ్పీటీసీ హసీనాబాను, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవీంద్రానాథ్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి తో కలసి విప్ కాపు మాట్లాడారు.. అధికార దాహంతో ఆ నాడు చంద్రబాబు అన్నీ వర్గాల ప్రజలను మోసం చేయడంతో పాటు రుణమాఫీ పేరుతో మహిళలను వంచనకు గురిచేశాడని ధ్వజమెత్తారు. బ్యాంకుల్లో ఎంతో గౌరవం పెంచుకున్న మహిళలను డిఫాల్టర్ అయ్యేలా చేశాడన్నారు. ఇంటికో ఉద్యోగం అన్నాడు.. కనీసం ఊరికొకటైనా ఇచ్చాడా..? కడుపులో పుట్టే బిడ్డ నుంచి పండు ముసలి వరకూ ప్రతి ఒక్కరినీ మోసం చేసిన దగల్బాజీ, దౌర్భాగ్యుడు చంద్రబాబు అని విరుచుకుపడ్డాడు.

చంద్రన్న టోకరా కావాలా..? జగనన్న ఆసరా కావాలా..?

చంద్రన్న టోకరా కావాలా..? జగనన్న అందించే ఆసరా కావాలో తేల్చుకోవాలని విప్ కాపు హితవు పలికారు. కరోనా లాంటి ఆర్థిక సంక్షోభం వెంటాడినా ఇచ్చిన మాటకు కట్టుబడి మూడో ఏడాది కూడా ఆసరా సొమ్ము జమ చేశారన్నారు. రాయదుర్గం నియోజకవర్గం లో 3,707 డ్వాక్రా సంఘాలు రుణమాఫీకి అర్హత సాధించగా 36,912 మంది అక్క, చెల్లెమ్మల ఖాతాలకు రూ.22.66 కోట్లు అందించే ప్రక్రియ మొదలైందన్నారు. ఒక్క డి హీరేహాళ్ మండలానికి మాత్రమే రూ.5.10 కోట్లు జమవుతాయన్నారు. ఈ సందర్భంగా మెగాచెక్కును లబ్దిదారులకు అందజేశారు

కాలవా.. అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ముండమోపు రాజకీయాలు చేస్తున్నారని, ఇలాంటి ద్రోహులకు కాకుండా మంచిచేసే వారికి మాత్రమే రాజకీయాల్లో చోటివ్వాలని విప్ అన్నారు. కాలువకు దమ్ము, ధైర్యం ఉంటే నాతో కలసి ప్రజల వద్దకు రావాలని సవాల్ విసిరారు..? వారు ఎంపిక చేసిన ఇంటి వద్దకే కలసి వెళ్దాం. టీడీపీ హయాంలో ఆ ఇంటికి మీరెంతిచ్చారు..? మా మూడున్నరేళ్ల హయాంలో మేమెంత లబ్ధి చేకూర్చామో చర్చిద్దామన్నారు. చేతకాని రాజకీయాలు మానుకోవాలని ఘాటుగా హెచ్చరించారు. నిన్ను, నీ పార్టీని మహిళలే బంగాళా ఖాతాంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారని హెచ్చరించారు. అనంతరం ఆయన స్టాళ్లను పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైకేపీ ఏసీ గంగాధర, ఎంపీడీఓ భాస్కర్‌బాబు, తహసీల్దార్ బసవకుమార్, ఏపీఎం శివప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, వేల సంఖ్యలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

జగన్‌తోనే మహిళాభ్యుదయం





వైఎస్సార్ ఆసరా' చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, హాజరైన డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు

- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు: మహిళలను మహారాణులుగా చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో వైఎస్సార్ ఆసరా సంబరాలను డ్వాక్రా మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు 'వైఎస్సార్ ఆసరా' కింద నగదును జమ చేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు రుణమాఫీ పేరుతో మహిళలను వంచించారన్నారు. ప్రస్తుతం ప్రజలు, రైతులు, మహిళా సంఘాలు, విద్యార్థులు, కుల వృత్తుల వారిని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆర్థికంగా ఆదుకుంటుంటే ఎల్లో మీడియా ఓర్వలేక నిప్పులు కక్కుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది లక్షల మంది డ్వాక్రా సంఘాల సభ్యులకు దాదాపు రూ.25 వేల కోట్లు ఆసరా కింద నగదును నేరుగా అక్క చెల్లెమ్మకు వేశారని గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు చేసిన అప్పులు కూడా జగన్‌మోహన్‌రెడ్డి తీరుస్తున్నారన్నారు. మహిళలను మహరాణులుగా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్న జగనన్నకు మహిళలు అండగా నిలవాలన్నారు. ఒక్క విడపనకల్లు మండలంలో 596 మహిళా సంఘాలకు మూడు విడతలో రూ.12,37,87,635 మహిళల ఖాతాలో జమ చేశారన్నారు. అనంతరం మూడో విడత కింద మంజూరైన వైఎస్సార్ ఆసరా చెక్కును విశ్వేశ్వరరెడ్డి చేతుల మీదుగా మహిళా సంఘాల సభ్యులకు అందజే శారు. అంతకుముందు సీఎం చిత్ర పటానికి డ్వాక్రా సంఘాల సభ్యులు, మాజీ ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఎంపీపీ కరణం పుష్పావతి, వైస్ ఎంపీపీ సునీతరాణి, జెడ్పీటీసీ హనుమంతు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసన్న, భరత్ రెడ్డి, భీంరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు సుంకన్న, సిద్దార్థ, అంగడి శ్రీనివాసులు, తహసీల్దారు బ్రహ్మయ్య, ఎంపీడీఓ శ్రీనివాసులు, వైకేపీ అధికారు లు, సర్పంచులు, ఎంపీటీసీలు, వీఓ లీడర్లు, మహిళలు పాల్గొన్నారు.

రుణపడి ఉంటాం

కంబదూరు: వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నిధులు మంజూరు కావడంతో ఆదివారం మండలంలోని కదిరిదేవరపల్లి గ్రామంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు సంబరాలు చేసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు సంబంధించిన డ్వాక్రా రుణాలను మాఫీ చేసి అండగా ఉంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, యానిమేటర్ దివ్య, డ్వాక్రా సంఘాల లీడర్లు వన్నూరమ్మ, బొమ్మక్క, సుజాతమ్మ, బోయ అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ తారు రోడ్డు



జేసీబీతో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

డి హీరేహాళ్(రాయదుర్గం): స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రోడ్డు ముఖమే ఎరుగని పల్లెలకు సైతం తారురోడ్డు నిర్మాణాలు జరుగుతున్నాయంటే, ఇది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువేనని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. డి హీరేహాళ్ మండలంలోని బాదనహాళ్– గొడిశెలపల్లి మార్గం మధ్యలో 2.4 కిలోమీటర్ల మేర రూ.60 లక్షల ఏఎంసీ నిధుల ద్వారా చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం విప్ కాపు జేసీబీ నడిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడారు.. గత టీడీపీ హాయంలో మంత్రిగా ఉన్న కాలవ స్వార్థానికి తప్పా అభివృద్ధికి ఏమాత్రం పాటుపడలేదన్నారు. ఆయన భూమిపూజ చేసి వదిలేసిన రోడ్లు కూడా తాము పూర్తిచేయాల్సి వస్తోందన్నారు. ఈ మూడున్నరేళ్లలో 90 శాతం రోడ్లను బాగు చేయించామని గర్వంగా చెప్పారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ రామమోహన్‌రెడ్డి, కాంట్రాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, గుమ్మఘట్ట జెడ్పీటీసీ పీఎస్ మహేష్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవీంద్రనాథ్‌రెడి, కల్యాం సురేష్, తొండె వెంకటేశులు, సురేష్‌యాదవ్, శ్రీనివాసరెడ్డి, ఓబుళాపురం మల్లికార్జున పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



బాధిత కుటుంబాలకు రూ.10 వేలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు లోకేష్

బొమ్మనహాళ్: ఎండు మిర్చిని బ్యాడిగి మార్కెట్‌లో విక్రయించేందుకు వెళ్తూ కర్ణాటకలోని బెంగళూరు–బళ్లారి జాతీయ రహదారి తమ్మేపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గోవిందవాడ గ్రామానికి చెందిన రైతులు దాసరి కేశప్ప, బోయ వంద్రప్ప అక్కడిక్కడే మృతి చెందారు. మరో రైతు కుమ్మరి సోమన్న, డ్రైవర్ వన్నూరువల్లి తీవ్ర గాయాలపాలయ్యారు. ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకుడు లోకేష్, జెడ్పీటీసీ సభ్యురాలు నీలవేణి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ. 10 వేలు అందజేశారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతగా వాల్మీకుల ర్యాలీ



ఉరవకొండలో ప్రభుత్వానికి మద్దతుగా ర్యాలీ చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

ఉరవకొండ: వాల్మీకులు, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసిన సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ జిల్లాకేంద్రం అనంతపురంలో ఆదివారం ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆధ్వర్యంలో భ్యారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ఉరవకొండ నుంచి వాల్మీకి సంఘం నాయకులు, సర్పంచ్ రామాంజనేయులు, వాల్మీకి యువత అధ్యక్షులు ఇంద్రావతి సురేంద్ర, బూషప్ప, భాస్కర్, కొనకొండ్ల రాజు, ఏర్రిస్వామి తదితరులు తరలివెళ్లారు.

సువార్త సభలను విజయవంతం చేయండి

కంబదూరు: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించే మహిమ సువార్త సభలను విజయవంతం చేయాలని సీఅండ్‌విజీ మిషన్ చర్చి పాస్టర్ జేమ్స్, సెక్రటరీ ప్రభాకర్, ట్రెజరర్ జోషఫ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ జోయెల్, జాయింట్ ట్రెజరర్ విల్సన్ పిలుపు నిచ్చారు. ఆదివారం సువార్త సభలకు సంబంధించిన పోస్టర్లను వారు విడుదల చేశారు. రెండు రోజుల పాటు సాయంత్రం 6 గంటలకు నిర్వహించే మహిమ సువార్త సభలకు ముఖ్య ప్రసంగీకులుగా గుత్తి బైబిల్ మిషన్ ప్రెసిడెంట్ రెవరెండ్ బి.అద్భుత కుమార్, దైవజనురాలు బి.మణికుమార్ హాజరవుతారన్నారు.

ఇద్దరికి గాయాలు

కూడేరు: మండల కేంద్రంలోని కరెంట్ ఆఫీస్ ఎదురుగా అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్ ఢీకొనడంతో పూలకుంటకు చెందినపోలప్ప, శివయ్య తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108 వాహనంలో అనంతపురం తరలించారు.

సెలూన్ దుకాణం దగ్ధం

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామంలో షార్ట్ సర్క్యూట్ వల్ల సెలూన్ దుకాణం దగ్ధమైంది. గ్రామానికి చెందిన మణికంఠ సెలూన్ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ అయి దుకాణం మొత్తం దగ్ధమైపోయింది దాదాపు రూ. లక్ష నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు.

జగ్జీవన్‌రామ్ విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న సీఐ, సర్పంచ్, జెడ్పీటీసీ

ఉరవకొండ: స్థానిక క్లాక్‌టవర్ సమీపంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వెనుక వైపు దళితుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ ప్రతిష్టకు ఆదివారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అర్బన్ సీఐ హరినాథ్, సర్పంచ్ లలితమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతమ్మ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజు, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, విగ్రహ దాత మోపిడి తిప్పయ్య హాజరయ్యారు. వారు మాట్లాడుతూ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసిన మహోన్నత వ్యక్తి జగ్జీవన్ అన్నారు. ఉరవకొండలో ఆయన విగ్రహన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొకుంట్ల రవి, మండల గౌరవాధ్యక్షులు గంగాధర్, ఓబయ్య, చెన్నప్ప, కొకుంట్ల సురేష్, వార్డు సభ్యులు రామాంజినేయులు, మల్లి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాతిదూలం లాగుడు పోటీలు



మొదటి బహుమతి అందజేస్తున్న ఈఓ, చైర్మన్

డి హీరేహాళ్ (రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని అంజనేయస్వామి ఉగాది ఉత్సవాల్లో బాగంగా ఆఖరి రోజైన ఆదివారం రాతిదూలం లాగుడు పోటీలు ఘనంగా నిర్వహించారు. పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఐదు జతల ఎద్దులు పాల్గొన్నాయి. బెళుగుప్ప మండలం శీర్పి వృషభాలు మొదటి స్థానం, గంగవరం వృషభాలు రెండోస్థానం, గుమ్మఘట్ట మండలం కేఎస్‌దొడ్డి వృషభాలు మూడో స్థానంలో నిలిచాయి. అనంతరం వృషభ యజమానులకు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు ఆలయ కమిటీ చైర్మన్ పద్మనాభరెడ్డి, ఈఓ నరసింహారెడ్డి, పార్టీ నాయకుడు మురళీమోహన్‌రెడ్డి, గ్రామస్తులు అందజేశారు.

పేదలకు రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా సరుకులు పంపిణీ చేస్తున్న దాత, రిటైర్డ్ తహసీల్దార్ ముల్లా రఫీక్, ఖాజీ సైఫుల్లా

రాయదుర్గంటౌన్: కష్టాల్లో ఉన్న సాటి మనిషిని ఆదుకోవడం, నిరుపేదల ఆకలి తీర్చడమే రంజాన్ ముఖ్య ఉద్దేశ్యమని రిటైర్డ్ తహసీల్దార్ ముల్లా రఫీక్, ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ సైఫుల్లా అన్నారు. పట్టణానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ ముల్లా రఫీక్‌సాబ్ తన తండ్రి ముల్లా మాబుసాబ్ జ్ఞాపకార్థం ఒక్కో కిట్ రూ.1100 విలువైన రంజాన్ తోఫా కింద నిత్యావసర సరుకులను దాదాపు 150 మంది నిరుపేదలకు ఆదివారం పంపిణీ చేశారు. పట్టణంలోని పాపట్ల వీధిలోని తన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ ఖాజీ సైపుల్లా, లెక్చరర్ అయూబ్‌ఖాన్, గుండ్లపల్లి మజీద్‌సాబ్, దాత సోదరులైన ముల్లా నజీర్ అహ్మద్, ముల్లా రియాజ్ అహ్మద్ హాజరయ్యారు. అల్లా విధేయులుగా, ప్రవక్త అడుగుజాడల్లో నడిచి పేదల ఆకలిబాధను తీర్చి ప్రతి మనిషి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో అల్లాఫ్, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగ కొనుగోలుకు స్పందన



రైతుభరోసా కేంద్రంలో పప్పుశనగ విత్తనాలను సేకరిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండల కేంద్రంలోని రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన పప్పుశనగ కొనుగోలుకు రైతుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఇటీవల ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని క్వింటాల్ పప్పుశనగ మద్దతు ధర రూ.5,335 రూపాయలుగా నిర్ణయించి, కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. మండల వ్యాప్తంగా సుమారు 200 మంది రైతులు పప్పుశనగ కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు మండలవ్యాప్తంగా 300 క్వింటాళ్ల పప్పుశనగ సేకరించినట్లు పీఏసీఎస్ చైర్మెన్ సుధీర్‌రెడ్డి, పీఏసీఎస్ అధికారి సతీష్ తెలిపారు

నేడు మార్కెట్ వేలం

కణేకల్లు: మండల కేంద్రంలో దినసరి, వారపు సుంకం వసూళ్లకు సంబంధించి వేలం పాటను సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈ వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా' చెక్కుల పంపిణీ

బొమ్మనహాళ్: డ్వాక్రా మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. పొదుపు సంఘాల మహిళలు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఏప్రిల్ 2న..

వజ్రకరూరు: మండల కేంద్రంలో ఏప్రిల్ 2న 'వైఎస్సార్ ఆసరా' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, ఎంపీపీ రమావత్‌దేవి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి హాజరై మహిళలకు మెగా చెక్కును అందజేస్తారన్నారు. అంతకుముందు వారు వైఎస్సార్ ఆసరా సంబరాల సభా స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచు మోనాలిసా, ఎఫ్‌పీఓ చైర్మన్ అమర్‌నాథ్, జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్, ఉపాధ్యక్షుడు ఉస్మాన్, బీసీ సెల్ కార్యదర్శి వీరభద్రగౌడ్, ఎంపీటీసీ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ సిలిండర్ వితరణ

కంబదూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్సుగా పని చేస్తున్న రాధాబాయి తన కుమారుడి శ్రీకర్‌బాబు జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రికి అవసరమైన ఆక్సిజన్ సిలిండర్, నెబులైజర్ మిషన్ వితరణ చేశారు. ఆదివారం ఆ పరికరాలను వైద్యాధికారి ఆసియాకు స్టాఫ్ నర్సు రాధాబాయి, సురేష్‌బాబు దంపతులు అందజేశారు.

ఈ- కేవైసీ చేయించుకోండి

కూడేరు: మండల వ్యాప్తంగా పీఎం కిసాన్ పథకం కింద లబ్ధి పొందుతూ ఈ–కేవైసీ చేయించుకోని రైతులు 2,034 మంది ఉన్నారని, వారంతా ఈ నెల 31లోపు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని ఏఓ నవత ఆదివారం సూచించారు. బ్రాహ్మణపల్లిలో 32 మంది రైతులు, చోళసముద్రంలో 65, గొటుకూరులో 93, ఇప్పేరులో 291, జయపురంలో 133, కలగళ్లలో 300, కమ్మూరులో 192 , కొర్రకోడులో 153, కూడేరులో 324, మరుట్లలో 109, ఎంఎంహళ్లిలో 73, తిమ్మాపురంలో 105, ఉదిరిరిపికొండలో 162 మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకోలేదన్నారు. ఇందులో పలువురు రైతులు ఇతర ప్రాంతాల్లో ఉన్నారని, వారు సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లోకి వెళ్లి ఈ–కేవైసీ చేయించుకునే సౌలభ్యం ఉందన్నారు. రైతులు వెంటనే ఈ–కేవైసీ చేయించుకోవాలని, లేదంటే ప్రభుత్వ పథకాల లబ్ధిని కోల్పోవాల్సి వస్తుందని ఆమె తెలిపారు.

దువా.. ఓ దివ్య ఔషధం



సామూహిక దువాలో నిమగ్నమైన ముస్లింలు

- రంజాన్ మాసంలో ముస్లింలకు ప్రత్యేకం
- అందరూ బాగుండాలని కోరుకుంటేనే ఫలితం

రాయదుర్గంటౌన్: దువా..ఓ దివ్య ఔషధం. సర్వరోగ నివారణిలా సకల సమస్యలు పరిష్కరించగలిగే మహామంత్రం. దువా అంటే వేడుకోవడం, ప్రశ్నించడం, అర్థించడం అని అర్థం. అల్లా సన్నిధిలో చేతులెత్తి వేడుకుంటే నుదుటి రాతలు కూడా మారే అవకాశం లేకపోలేదు. ఎవరి దువా అల్లాకు అంగీకార యోగ్యమవుతుందో అలాంటి వారి జాతకమే మారిపోతుందని మౌల్వీలు తెలిపారు. అలాంటి దువాకు రంజాన్ మాసంలో అత్యంత ప్రాధాన్యం ఉంది. 'అద్దువావు ముఖల్ ఇబాదా' అని హదీస్ చెబుతుంది. దువా అన్ని ఇబాదత్‌ల(దైవారాధనల) ప్రాణం లాంటిదని దీని అర్థం. ఎవరైతే చేతులెత్తి అల్లాను మనస్సుపూర్వకంగా వేడుకుంటారో అతని దువా తప్పక ఫలిస్తుందని, సమస్య పరిష్కారమవుతుందని మౌల్వీలు పేర్కొంటారు. దువా అంటే అల్లా సన్నిధిలో నేరుగా అడగడమే. ఇస్లాం ధర్మ నియమాలు పాటిస్తూ, ప్రవర్త మార్గంలో నడుస్తూ, అక్రమాలు, అసత్యాలు, తప్పుడు సాక్ష్యాలకు దూరంగా ఉంటూ, ఇతరుల మనస్సు నొప్పించకుండా, కష్టపడి సంపాదించిన సొమ్మునే ఆహారంగా తీసుకుంటూ, తల్లిదండ్రులు పెద్దల ఎడల గౌరవభావం, చిన్నవారు, పేదవారు, అనాథల ఎడల కరుణ చూపే వారు చేసే దువా శక్తివంతంగా ఉంటుందంటారు. రహస్యంగా అంటే అల్లాకు తప్ప మరొకరికి తెలియని పద్ధతిలో చేసే కొన్ని మంచి పనులు సహాయకారిగా నిలుస్తాయి. తల్లిదండ్రుల ఆయురారోగ్యాలు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు, బంధువులు, ఊరి ప్రజల మంచిని దువాలో కోరుకోవాలి. అందరూ బాగుండి, వారి పుణ్యం వల్ల తనూ, తన భార్యాపిల్లలు కూడా బాగుండాలని కోరుకుంటునే దువా వల్ల నిజమైన ఫలితం లభిస్తుంది.

నియమాలు..

దువా చేసే సమయంలో దృష్టి కిందికి పెట్టాలి. పవిత్ర మనసు, పూర్తి విశ్వాసంతో ఉండాలి. పరిశుభ్రంగా ఉండి వజూతో దువా చేస్తే సత్ఫలితం ఉంటుంది. ముఖాన్ని పడమటి వైపు (అంటే ఖిబ్లా వైపు) ఉంచి దువా చేస్తే మంచిది. అబద్ధాలు చెప్పరాదు. మోసం చేయరాదు. తల్లిదండ్రుల ఎడల సత్ప్రవర్తనతో మెలగాలి. భుజించే ఆహారం పాపపు సొమ్ముతో కూడినదై ఉండరాదు. దానధర్మాలు, దైవారాధనలు చేస్తుండాలి. ఐదు పూటలా నమాజు, రోజా, సత్ప్రవర్తనతో దువా చేయడం ద్వారా అల్లాను ప్రసన్నం చేసుకోగలిగితే అడిగినవన్నీ ప్రసాదించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఉపవాస దీక్షపరుడి దువా మాదిరిగానే మక్కాలోని పవిత్ర హరం షరీఫ్ వద్ద హజ్ సమయంలో చేసే దువా కూడా తప్పకుండా ఫలిస్తుందంటారు. తప్పును పునరావృత్తం కాకూడదనే దృఢ సంకల్పంతో దువా చేస్తే అల్లా పాపాలను క్షమించి వేసి పునీతమైన కొత్త జీవితం ప్రసాదిస్తాడు.